# భౌతిక వాది

చంద్రశేఖర్ ఆఫీసులో పని చేసుకుంటున్నప్పుడు మెసేజ్ వచ్చింది 'మదర్ ఎక్స్‌పైర్డు! స్టార్ట్ యిమ్మీడియట్లీ!'

చంద్రశేఖర్ షాక్ తినలేదు. తనలో తాను గొణుక్కున్నాడు – 'వన్‌డే షిహాజ్‌టుగో – నౌ షిహాజ్‌గాన్' – ప్రక్కనున్న కొలీగు శ్రీరాం అడిగాడు ఏం జరిగిందని.

" మా అమ్మ చనిపోయిందట ! నేను వెంటనే బయలుదేరి ఇండియాకు వెళ్ళాలి!" చెప్పాడు చంద్రశేఖర్.

" అయ్యో ! ఎంత పని జరిగింది – సారీ ! జీవితంలో కోలుకోలేని దెబ్బ తగిలింది." సానుభూతి చూపించాడు.

" ఏం చేస్తాం – ఎప్పటికైనా ఆమె మరణించాల్సిందే గదా ! అది ఇప్పుడు జరిగింది ! పుట్టినవాడు గిట్టక తప్పదు" చంద్రశేఖర్.

అతని గుండె బలానికి ఆశ్చర్యపోయాడు శ్రీరాం.

రెండు రోజుల్లో చంద్రశేఖర్ స్వస్థలానికి వచ్చి వాలాడు. పార్వతమ్మ భౌతిక కాయం అతనికోసం ఎదురు చూస్తున్నది.

మంచు పెట్టెలో వున్న ఆమె దేహాన్ని చూస్తూ ఉండిపోయాడు.

" ఒరే ! నిన్ను చూడాలి చూడాలి అని కలవరించి చనిపోయిందిరా !" తండ్రి భార్గవ చెప్పాడు కొడుకును ఓదారుస్తూ.

" అవును – అంత తొందరపడి ఎందుకు వెళ్ళిపోయింది?" అడిగాడు చంద్రశేఖర్.

" నీకు తెల్సుగా ఆమెకు ఆస్తమా ఉంది – ఈ సీజనులో ఎక్కువయిపోతూ ఉంటుంది. వారం క్రిందట చాలా ఎక్కువయింది. హాస్పిటల్లో చేర్చాం ! మందులు సరిగా పనిచెయ్యడం లేదు. పైగా ముక్కులో గొట్టాలు పెట్టారు. అవి విపరీతంగా బాధపెట్టాయి– ఎందుకో అవి లాగేసింది. మేము చూసే సరికి ప్రాణం పోయింది" ఏడుస్తూ చెప్పాడు తండ్రి భార్గవ.

" హూ ! అస్తమా కూడ ఒక జబ్బా ! ఎయిడ్సు లాంటి భయంకర వ్యాధుల్నే కంట్రోలు చేస్తున్నారు – ఆఫ్టరాల్ ! ఆయాసం కోసం అసువులు తీసుకోవాలా!" బాధగా అన్నాడు చంద్రశేఖర్.

" దాందేముంది కడుపునెప్పి తగ్గక ఎంత మంది ఆత్మహత్యలు చేసుకోవడం లేదు – అంతా విధి ! మన చేతిలో ఏమీ లేదు" తండ్రి.

" నాకు చెప్పినా – అమెరికా నుండి మంచి మందు పంపించేవాడిని!"

" అవి పనిచెయ్యవు. రియాక్షను వస్తే కంట్రోలు చెయ్యడం కష్టం! పోనీలే ఆమె అదృష్టవంతురాలు - మంచానపడకుండా తప్పుకుంది!" తండ్రి ఓదార్చాడు కొడుకును.

మరునాడు అంత్యక్రియలు ఘనంగా జరిగాయి.

కొన్ని రోజులుండి వాళ్ళ కులాచారం ప్రకారం కర్మ చేశాడు.

అమెరికాకు ప్రయాణం అయ్యే రోజు వచ్చింది...

" చంద్రా ! నాదొక చిన్న రిక్వెస్టు !" తండ్రి గొణిగాడు.

" చెప్పు నాన్న !" చంద్రశేఖర్ అయిష్టంగా అడిగాడు.

" నువ్వు అమెరికా వెళ్ళాల్సినంత అవసరం ఏముందిరా ! ఇండియాలో ఉండిపోకూడదూ?" భార్గవ ఆవేదన.

" అక్కడ ఉద్యోగం చేస్తున్నాగా - డాలరు రూపాయి కంటే ఖరీదైంది - అక్కడ ఉన్నన్ని అవకాశాలు యిక్కడ లేవుగా !" పొడిపొడిగా చెప్పాడు.

" నువ్వు ప్రయత్నిస్తే నీ అనుభవం చూసి యిక్కడే యిస్తారేమో మంచి ఉద్యోగం!" దీనంగా అడిగాడు, ఏ మూలో యింకా ఆశ అతడిలో ఉంది.

" ఆ ప్రయత్నాలు అన్నీ అయిపోయి - అవి ఫలించకే గదా నేను అమెరికా వెళ్ళింది - అప్పుడు ఆరువేలు కూడ సంపాదనలేని వాడిని అక్కడ రెండు లక్షలు నెలకు సంపాదించాను. ఇప్పుడు ఐదు లక్షలు సంపాదిస్తున్నాను. ఇండియాలో నాకు ఎవరన్నా యింత జీతం యిస్తారా? నేను చేసే రీసెర్చి చేయడానికి వసతులు కల్పిస్తారా ?" ఆవేశంగా అడిగాడు చంద్రశేఖర్, తను చదువు పూర్తి చేసుకున్నప్పుడు పడ్డపాట్లు తలచుకుని.

" అప్పటికి ఇప్పటికి ఇండియా కొంత మారిందిరా! ఇప్పుడు ఉద్యోగావకాశాలు పెరిగాయి !" తండ్రి తడబడుతూ చెప్పాడు.

" దాంతో పాటు నిరుద్యోగులు పెరిగారు - కాంపిటీషను పెరిగింది ! ఒక వేళ నాకు జాబ్ వచ్చినా యిప్పుడు నేను సంపాదిస్తున్నంత నాకు ఎవరూ యివ్వరు- యివ్వలేరు -" చంద్రశేఖర్ చెప్పాడు తండ్రికి అతని గొంతులో స్థిరత్వం ఉంది.

" ఎంత సంపాదించినా ఏం చేసుకుంటాంరా ! సంపాదించేది తనవాళ్ళ మధ్య ఖర్చుపెట్టుకుని దర్జాగా బ్రతకడానికేగా ! అమెరికాలో సంపాదించావు. ఇక శేషజీవితంలో దాన్ని ఖర్చు పెట్టుకుంటూ మా కంటి ముందు ఉండిపోకూడదూ?" తండ్రి అభ్యర్థన.

" ఒంట్లో శక్తి ఉన్నంతకాలం సంపాదించాల్సిందే ! ఆ తర్వాత ఎలాగూ ఖర్చు పెట్టడమే చేసే పని. అమెరికాలో నాలాంటి వాళ్ళకు ఎన్నో అవకాశాలు - అయినా ఈ ఇండియాలో ఏముంది నాన్నా ! " కౌంటరు వేశాడు చంద్రశేఖర్.

అవాక్కయ్యాడు భార్గవ - కొడుకు అలా అడుగుతాడని ఊహించలేదు - 'జననీ జన్మభూమిశ్చ - స్వర్గాదపి గరీయసి' అని చిన్నప్పుడు చంద్రశేఖర్ పాడుతూ ఉంటే తనువిని

ఆనందించేవాడు. ఉద్యోగం దొరకనప్పుడు కూడ తను అమెరికాకు వెళ్ళమంటే చాలా సందేహించి – అయిష్టంగా వెళ్లినవాడు –

" భారతదేశం నీ మాతృభూమి ! ఇది పేద దేశం కావచ్చు – కాని నువ్వు జన్మతీసుకున్న దేశం – నిన్ను పెంచి పోషించి విద్యనిచ్చి – అమెరికా పంపిన దేశం – నీ వాళ్ళున్న దేశం – నీ చుట్టాలు – బంధువులు – కన్న తండ్రి ఉన్న దేశం ఇది!" చెప్పాడు భార్గవ నొచ్చుకుంటూ.

" సిల్లీ ! నా దేశం నాదేశం అనుకోవడం నీచ గుణం – మన న్యారోమైండెడ్‌నెస్‌ని తెలుపుతుంది. మనకి బ్రాడ్‌మైండు ఉండాలి ! ఎవరైతే మనకి తింటానికి తిండి యిస్తున్నారో వాళ్ళనే నావాళ్ళు అనుకోవాలి – ఆదేశాన్నే నాదేశం అనుకోవాలి !" చెప్పాడు చంద్రశేఖర్.

భార్గవ నీరు కారిపోయాడు – బ్రైన్ పొల్యూషన్ !

తన కొడుకు చాలా గొప్పవాడని – ఎన్నో ఆదర్శ భావాలు కలవాడని అతని నమ్మకం. చిన్నప్పుడు ఆర్‌యస్‌యస్‌లో కూడా తెగ తిరిగాడు చంద్రశేఖర్ !

" చాలా ఎదిగిపోయావురా – చాలా చాలా ఎదిగిపోయావు!" కన్నీరు తుడుచుకుంటూ చెప్పాడు.

" కొడుకు ఎదగటం చూసి తండ్రి హర్షించాలి కాని అసూయతో ఏడవకూడదు." చంద్రశేఖర్ చెప్పాడు.

" ఇవి కన్నీళ్ళు కాదు – ఆనంద భాష్పాలు!" చెప్పాడు భార్గవ.

" నాన్నా ! నువ్వు ఒంటరిగా యిక్కడ ఉండి ఏం చేస్తావు?" అడిగాడు.

భార్గవ మొహంలో కళ వచ్చింది. కొడుకు తనను అమెరికా రమ్మంటాడని ఆశపడ్డాడు "నీతో పాటు నన్ను అమెరికా రమ్మంటావా? కాని ఈగాలి ఈ భూమి – ఈ నీరు నేను అంత తొందరగా మర్చి పోలేనురా! రోజూ ఈ ప్రకృతిని చూస్తూ ఉంటే అదొక తృప్తి !" చెప్పాడు కొంచెం బిగువు చూపిద్దామని.

" అబ్బే ! నువ్వు అమెరికా వచ్చి ఏం చేస్తావు? నేను ఆఫీసుకు వెళతాను – రోజాకూడ వెళుతుంది – పిల్లలు బళ్ళకి – నువ్వు ఒంటరిగా ఉండాల్సి వస్తుంది." చెప్పాడు చంద్రశేఖర్.

" అరే ! నువ్వు వచ్చేప్పుడు రోజాని – పిల్లలని వెంట పెట్టుకు రావలసింది." కొంచెం బాధగా అన్నాడు భార్గవ.

" కాని మన మతాచారాలు రోజాకు పడవు – అవి మూఢనమ్మకాలంటుంది – ఎందుకు ఘర్షణ అని తీసుకురాలేదు–" చెప్పాడు చంద్రశేఖర్.

భార్గవకు గుర్తుకొచ్చింది – అమెరికాకు వెళ్ళిన మూడవ సంవత్సరంలోనే అక్కడి గ్రీన్ కార్డు హోల్డరైన రోజా అనే క్రిష్టియన్ని చెప్పా పెట్టకుండా పెళ్ళి చేసుకున్నాడు చంద్రశేఖర్. అంతా అయిపోయి తను తాత అవబోయే సమయంలో తనకు తెలియచేశాడు.

తన కులంలో పరువు పోయింది - పెద్దరికం పోయింది...

కొన్నాళ్ళు మవునంగా ఉండిపోయారు.

తరువాత సమాధానపడి ఊరుకున్నారు.

ఇండియాకు వచ్చినప్పుడు రోజాను - ఇద్దరు పిల్లల్ని చూశాడు. రోజా కుందనపు బొమ్మ ! పిల్లలు అజంతా శిల్పాలు! కాని ఆమెకు తామంటే పడదు. తమ మతమంటే చులకన! తను దేవలోకం నుండి దిగివచ్చినట్లు ఫీలైపోతూ ఉండేది. ఒక్క రోజు మాత్రం తనింట్లో ఉంది - మిగతా రోజులు లాడ్జీల్లో - టూర్లల్లో ఉండి వెళ్ళింది మహాతల్లి.

పార్వతమ్మకు రోజాకు సయోధ్య అస్సలు కుదరలేదు.

ఆ మాటకొస్తే తనకు కూడ కుదరలేదు. లక్షలు రావాల్సిన కట్నాన్ని ఈమె మూలంగా కోల్పోయారు. కుటుంబ మర్యాద - కుల మర్యాదను ఈమె మూలంగా కోల్పోయాము అన్న భావన కలిగేది ఆమెను చూస్తే.

" తనింకా మారలేదా !" నిరాశతో అడిగాడు భార్గవ.

" ఎవరు మారతారు నాన్నా ! పెద్దవాళ్ళు మీరే మారనప్పుడు చిన్నది తాను మారగలదా? ఇంకానయం, నన్ను ఇప్పుడు రానిచ్చింది మంచిది కాబట్టి - తనకు ఆరోగ్యం బాగోలేదు - అయినా పొమ్మంది !" తన భార్య గుణసంపదను మెచ్చుకుంటూ చెప్పాడు చంద్రశేఖర్.

" ఉండిపోవలసింది బాబు ! ఏం కొంపలంటుకున్నాయని వచ్చావ్ !" నిష్ఠూరంగా అన్నాడు భార్గవ.

" కొడుకుగా కన్నతల్లి కర్మ చేయడం నా బాధ్యత కదా ! అందుకే ఇన్ని లక్షలు ఖర్చయినా వచ్చాను." గర్వంగా చెప్పాడు.

" నీది చాలా విశాల హృదయం! " తండ్రి చెప్పాడు వ్యంగ్యంగా.

" అందుకే నా మాట వినండి ! ఈ ఇల్లు అద్దెకిచ్చేసెయ్యండి - మీరు –" ఆగాడు చంద్రశేఖర్ తన బెట్టు సడలిస్తూ.

" మరీ అంత బలవంతం చేస్తే అమెరికాకు రాకుండా ఎలా ఉంటాను." భార్గవ అన్నాడు.

" వద్దు - వద్దు - అమెరికాకు రావద్దు - ఇక్కడే మంచి వృద్ధాశ్రమంలో చేరిపోండి - ఈ యింటి మీద వచ్చే అద్దెని ఆ ఆశ్రమానికి కట్టండి - ఇంకా మిగులుతుంది - ఆ రకంగా ఒంటరి తనం పోతుంది!" సలహా యిచ్చాడు చంద్రశేఖర్.

నివ్వెరపోయాడు " నాకింతవరకు ఈ ఆలోచన రాలేదు!" అన్నాడు.

" నాకూ రాలేదు. ఇది రోజా చెప్పింది. ఆయన ఒంటరిగా వుంటే డిప్రెషన్‌లో పడతారు - ఏదన్నా ఆశ్రమంలో చేర్పించండని చెప్పింది. నాకు టైం లేదు నిన్ను చేర్పించి

పోవడానికి – పైగా ఎల్లుండికి టికెట్టు కనఫర్మ్ అయిపోయింది." చంద్రశేఖర్ తన అసహాయత తెలిపాడు.

" చాలా సంతోషం బాబు ! అమెరికాలో వున్న మీరు మా గురించి ఎంతో శ్రద్ధగా ఆలోచిస్తున్నారు –" వ్యంగ్యంగా అన్నాడు భార్గవ.

" ఈసారి నాకు ముందు తెలియచెయ్యి – కొంచెం సెలవు సదుపాయంచేసుకుని వస్తాను. ఈసారి నీకోడల్ని – పిల్లల్ని తీసుకువస్తాను. కర్మ యింతకంటే ఘనంగా చేస్తాను. బంధువుల్ని– స్నేహితుల్ని తప్పకుండా పిలుస్తాను – ముందే లిస్టు అడ్రసులు రాసి పెట్టుకుంటే నాకు మేలు చేసిన వాడవవుతావు!" చంద్రశేఖర్ చెప్పాడు.

భార్గవ అతని మాటలకు ఆశ్చర్యపోయి – బాగా బాధపడ్డాడు కూడ.

చంద్రశేఖర్ వీడ్కోలు తీసుకుని టాక్సీలో హైద్రాబాద్‌కు బయలు దేరాడు – అక్కడినుండి యింటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అమెరికాకు వెళదామని కాని అతని దురదృష్టం – అతని ట్యాక్సీ అలంపురం చౌరస్తా దగ్గర ఆగివున్న లారీని గుద్దేసింది. కారు తుక్కుతుక్కు అయింది. డ్రైవర్ ఆన్‌ది స్పాట్ డెడ్ !

చంద్రశేఖర్ గాయాలతో స్పృహ తప్పాడు, ప్రాణాలతో బ్రతికి ఉన్నాడు.

దారిన పోయే దానయ్యలు నూటఎనిమిదికి ఫోన్ చేస్తే – నూట ఎనిమిది వ్యాన్ తెచ్చి చంద్రశేఖర్ని కర్నూలు జి.జి. హెచ్‌లో చేర్పించింది.

నాలుగు రోజుల తర్వాత స్పృహలోకి వచ్చాడు చంద్రశేఖర్.

" నాన్న! రోజా ఎలా వుంది?" అడిగాడు తండ్రిని చూసి బావురుమంటూ.

" ఆమెకేమైంది – బాగానే ఉంది–" ఓదారుస్తూ చెప్పాడు భార్గవ.

" నాకోసం దిగులు పెట్టుకుని ఉంటుంది... నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. నేను లేకపోతే తిండి కూడ సరిగా తినలేదు –" బాధగా చెప్పాడు చంద్రశేఖర్.

భార్గవకు కళ్ళునీరు కమ్మాయి అతని అనురాగానికి.

వెంటనే రోజాకు సెల్ చేసి – మాట్లాడమని చంద్రశేఖర్‌కిచ్చాడు స్పీకర్ ఆన్ చేసి – సెల్ అతని తలప్రక్కన అమర్చాడు పడకుండా.

" చందూ ! హౌ ఆర్యూయూ ! పెద్ద దెబ్బలేం తగల్లేదు కదా !" రోజా అడుగుతున్నది.

" రోజా ! నేను బాగున్నాను – నువ్వెలా వున్నావు – నేను వెంటనే రాలేను – బాగయింతర్వాత రాగలను – లేదా నువ్వు వస్తానంటే వచ్చెయ్యి." చంద్రశేఖర్ చెప్పాడు.

" ఇంకెన్నాళ్ళు ట్రీట్‌మెంటు తీసుకోవాలి !నాకు కుదరదు. బోల్డు బిజీ!"

" ఇంకో రెండు నెల్లు కనీసం తీసుకోవలసి రావచ్చు అని అనుకుంటున్నాను. కాలు, చెయ్యి ఫ్రాక్చర్ అయ్యాయి. అక్కడి కొచ్చి నిన్ను ఎక్కువ యిబ్బంది పెట్టలేను – తగ్గింతర్వాత వస్తాను –"

" ఫర్వాలేదు - నాకిక్కడేం లోటు లేదు - బైది బై - జాన్ నీతో మాట్లాడుతాడట!" రోజా చెప్పింది - ఆ మాటలు విని అతని మొహం నల్లబడింది. జాన్ అంటే సరిపోదు.

" హాయ్! చందూ ! డోంట్ వర్రీ ! మీ ఆవిడ గురించి నేను శ్రద్ధ తీసుకుంటాను. ఆమెకు ఏ లోటు రానివ్వను - రెండు నెల్లు కాకపోతే నాలుగు నెల్లు ఆగిరా - నువ్వు లేని లోటు నేను తీరుస్తాను -" అతను చెప్పాడు - వెనకాల రోజా పకపక నవ్వులు వినిపించాయి. అతను ఆమె బోయ్ ఫ్రండు! ఒంటి మీద జెర్రులు పాకాయి.

" నాన్నా ! ఆఫ్ చెయ్యి - చాలు -" చంద్రశేఖర్ కళ్లు తుడుచుకున్నాడు.

" భర్తకు బాగోలేనప్పుడు అక్కడ ఆమె ఏం చేస్తుంది - రమ్మని చెప్పు !" భార్గవ.

" సారీ డాడ్ ! ఆమె సంపాదనా పరురాలు ! డాలర్లు లేంది బ్రతకలేదు. అమెరికన్ సొసైటీలో సుఖాలకు తక్కువ లేదు - ఆంక్షలు లేవు. వచ్చి నా కర్మకు ఆమేం చేస్తుంది. ఎవరి సుఖం వాళ్ళది! ఆమె నన్నా సుఖపడనివ్వండి!" జీరపోయిన గొంతుతో చెప్పాడు చంద్రశేఖర్.

భార్గవ విషన్న వదనంతో చూస్తూ ఉండిపోయాడు.

ఒక నెల తర్వాత ఇంటి ముఖం చూశాడు చంద్రశేఖర్ !

ఈ నెల రోజులు విజిటర్ల ప్రవాహం ! భార్గవ ఆత్మీయులు - స్నేహితులు - వారి విలేజినుండి సిటీకి పనిమీద వచ్చినవాళ్ళు తప్పని సరిగా చంద్రశేఖర్‌ను చూసి వెళ్ళే వాళ్ళు. చాలామంది గుడిలో పూజలు చేయించి ప్రసాదం తెచ్చి యిచ్చేవాళ్ళు ! అందరూ అభిమానంతో - ఆర్ద్రతతో పలకరించేవాళ్ళే !

ఇంటిలో వున్నా అతికష్టంమీద నడవగలుగుతున్నాడు - చేతులు కూడ పెద్దగా స్వాధీనంలో లేవు - మల్టిపుల్ ఫ్రాక్చర్సు తగ్గాలంటే టైం పడుతుంది.

భార్గవ కొడుకును పసిబిడ్డలాగా వెన్నంటి ఉపరిచర్యలు చేస్తున్నాడు. తనుకాకుండా ఇంకో నర్సును కూడ పెట్టాడు. వంట తనే చేస్తూ - అతనికి కావలసినవి అందిస్తున్నాడు.

ఓ రోజు న్యూటన్ భాస్కర్ ఫోన్ చేశాడు. న్యూటన్ అని రోజా పిలుస్తుంది. తను భాస్కర్ అని పిలుస్తాడు - అతను పెద్ద కొడుకు - యిప్పుడే కాలేజీలోకి ఎంటరయ్యాడు " హాలో డాడ్ ! బాగున్నావా ! నువ్వు లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది!" దిగులుగా చెప్పాడు న్యూటన్ భాస్కర్.

కాలేజీ కబుర్లు - తన స్నేహితుల కబుర్లు అయింతర్వాత అతను అసలు విషయంలోకి వచ్చాడు - "డాడ్ ! ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు."

" ఫర్వాలేదు చెప్పు - మీ మమ్మీ బాగుందా?" పొడిగా అడిగాడు.

" అది కాదు డాడ్ ! మమ్మి ఎందుకిలా అయిపోతున్నదో అర్థం కావడం లేదు. నువ్వున్నప్పుడు ఎంత డీసెంటుగా బిహేవ్ చేస్తున్నదో తలచుకొంటే మాకే ఆశ్చర్యంగా

ఉంది." చెప్పాడు భాస్కర్ న్యూటన్.

" ఆరోగ్యం బాగుంది కదా !" ఆందోళనగా అడిగాడు.

" దానికేం డాడ్ ! చాలా బాగుంది – ఎటొచ్చి మాకే ఈ ఇంట్లో ఉండాలో బయటకు పారిపోవాలో అర్థం కావడం లేదు" ఏడ్చాడు.

తమ్ముడు శరత్ పాల్ అందుకున్నాడు. " డాడ్ ! అమ్మ పిచ్చిదైపోతున్నది – షిఈజ్ మ్యాడ్ ! మ్యాడ్ ఆఫ్ సెక్సు అండ్ లిక్కర్స్ ! రోజా విపరీతంగా తాగుతున్నది – తాగి పడి ఉంటే భరించచ్చు. కాని రకరకాల మొగాళ్ళు ఇంటికి వస్తున్నారు. అంతకు ముందు మేమెప్పుడూ చూడలేదు. పీటరుగాడు – జాన్ గాడు – ఫిలిప్పుగాడు కూడ తరచుగా ఆమెతో కల్సి తిరుగుతున్నారు. రాత్రింబగళ్ళు తాగి ఎంజాయ్ చేస్తున్నారు – అప్పటికీ మొన్న నేను వార్నింగు యిచ్చాను డాడ్ !" ఏడుస్తూ చెప్పాడు శరత్ పాల్. చిన్నకొడుకు సున్నిత హృదయుడు.

"ఏమని ? " ఆందోళనతో అడిగాడు. అతనికి నెత్తురు సలసల కాగుతున్నది.

" మమ్మీ ! ఈ వయసులో ఇవి మంచి పన్లు కావు ! డాడీ కష్టాల్లో వున్నప్పుడు ఆయన దగ్గరుండాలి కాని యిలా నీ సుఖాలు చూసుకోవడం బాగోలేదు. మన సర్కిల్‌లో మా పరువు పోతున్నది – ఈ తిరుగుళ్ళు మానెయ్యమన్నాం! ఇది మంచి పద్ధతి కాదు అని చెప్పాం!" చెప్పాడు పాలు.

" ఏం చెప్పింది మీ మమ్మీ !" తడారిపోతున్న గొంతుతో అడిగాడు చంద్రశేఖర్.

" గెట్ లాస్టు అంది – ఇష్టం లేకపోతే యింట్లోంచి వెళ్ళిపొమ్మంది. ఈ ఇల్లు నాది – ఇది నేను సంపాదించాను. బయటకు పోయి మీ కాళ్ళ మీద మీరు బ్రతకండి – నా స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి మీరెవరు అని అడిగింది." బాధగా చెప్పాడు శరత్ పాలు.

పెద్ద కొడుకు అందుకున్నాడు – " మమ్మీ ఎంతకైనా తెగించేందుకు సిద్ధంగా ఉంది – డైవర్సుకు కూడా రెడీగా ఉంది డాడీ ! ఆమెకు డబ్బున్న పీటర్ తగులుకున్నాడు! మీరు తొందరగా అమెరికాకు వస్తే కాని ప్రాబ్లెంలు సాల్వు కావు – మాకు రోజుకో నరకంలాగుంది!" ఏడుస్తూ చెప్పాడు.

చంద్రశేఖర్ కాసేపు మాట్లేదేసి పెట్టేశాడు ఫోను.

పిల్లలకు తన తల్లిదండ్రుల పోలికలు వచ్చాయి. భారతీయ తత్వాలు అలవడ్డాయి. చిన్నప్పటి నుండి వాళ్ళకు హిందూ సాంప్రదాయం అంటే గౌరవం! తనంటే అభిమానం! పిల్లల్ని పెంచడంలో రోజా కంటే తనే ఎక్కువ కష్టపడ్డాడు. రోజాది తనకంటే మంచి జాబ్! సంపాదన ఎక్కువ, ఆ మక్కువతో ఓ దుర్ముహూర్తంలో దాన్ని కట్టుకున్నాడు – ఇంక తన జీవితం అడకత్తెరలో పోక చెక్కలా తయారై పోయింది. వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదు –

నిద్ర లేకుండా ఆలోచిస్తూ కూర్చున్న చంద్రశేఖర్‌ను అడిగాడు భార్గవ.

" చందూ ! ఏంటి ఆలోచిస్తున్నావు - ఇల్లు గుర్తుకొచ్చిందా? రోజా పిల్లలు !"

" నాన్న ! మన కులంలో - ఇక్కడి సొసైటీలో డైవర్సు వచ్చేశాయా?" చంద్రశేఖర్ బాధపడుతూ అడిగాడు తలొంచుకుని.

" లేదు చందూ ! అటువంటి ఆలోచనలు పెట్టుకోవద్దు. పిల్లలు భవిష్యత్తు పాడైపోతుంది. ఎదిగిన పిల్లలు - తల్లి లేని పిల్లలవుతారు."

" రోజా పూర్తి మెటీరియలిస్టుగా మారిపోయింది - తన సుఖం కోసం వెంపర్లాడుతుంది కాని - తన మీద ఆధారపడ్డవాళ్ళ గురించి ఆలోచించడం లేదు. డాలర్లున్నాయన్న అహం ఎక్కువై పోయింది." ఏడుస్తూ చెప్పాడు చంద్రశేఖర్.

" తప్పు - అర్థం చేసుకోవాలి ! మన సర్కిల్‌లో అందరూ నిన్ను మెటీరియలిస్టు అనే ఎగతాళి చేస్తారు. అయినా కన్నవాళ్ళము కాదనుకున్నామా? ఎప్పుడూ కలిసి ఉండటానికే ప్రయత్నించాలి!" తండ్రి భార్గవ చెబుతున్న విషయాలు విస్మయంగా వింటున్నాడు. 'మెటీరియలిస్టులు' అన్న పదం కొరడాతో కొట్టినట్లయింది.

" అందరూ సుఖపడాలంటే తమ వ్యక్తిగత సుఖాలు కొన్ని తగ్గించుకోవాలని రోజాకు చెప్పు. స్వార్థాన్ని అదుపులో పెట్టుకుంటేనే సుఖపడగలం! ఇతరులను సుఖపెట్టడంలో నిజమైన సుఖం ఉంది అని రోజాకు గుర్తు చెయ్యి. మెటీరియలిజం కంటే స్పిరిచ్యుయలిజంలోనే సుఖం ఉందని బోధించు! మెటీరియలిస్టులు ఎప్పటికైనా దుఃఖాలలో కూరుకుపోతారు." భార్గవ చెబుతూంటే చంద్రశేఖర్ తలొంచుకుని పాశ్చాత్తాపంతో వింటున్నాడు.

" శారీరికానందం ఎంత కాలం అనుభవించగలరు? కొంతకాలం! అదే ఆత్మానందం అయితే జీవితాంతం అనుభవించగలరు." భార్గవ.

" రోజా వినకపోతే నేనేం చెయ్యాలి?" చంద్రశేఖర్.

" కౌన్సిలింగ్ ! అప్పటికీ వినకపోతే పిల్లలతో ఇండియాకు వచ్చెయ్యి. ఆమెకి జ్ఞానోదయం అయినప్పుడు తను వస్తుంది." భార్గవ.

భౌతికవాది చంద్రశేఖర్‌లో కూడ ఏదో పరివర్తన కలుగ సాగింది.

- ఆదివారం ఆంధ్రభూమి 18.9.2011